క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన రాములు గత సంవత్సరం విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు మంజూరైంది. కాగా బుధవారం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌లు రాములు భార్య శారదకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రవంతి, అశోక్, నాయకులు కాత్రాల మల్లయ్య, హిమవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లేట్లు, టిఫిన్ బాక్స్‌లు పంపిణీ



విద్యార్థినులకు ప్లేట్లు, టిఫిన్ బాక్స్‌లు అందజేస్తున్న డీడీ రవీందర్‌రెడ్డి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో బుధవారం విద్యార్థినులకు ప్లేట్లు, టిఫిన్ బాక్స్‌లు, గ్లాసులను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ డీడీ రవీందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహం కిచెన్, స్టోరురూంను తనఖీ చేశారు. సరుకుల రిజిస్టర్‌ను పరిశీలించారు. వసతి గృహంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని డీడీ రవీందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి చందన పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతి ఇస్తున్న సెక్టోరియల్ అధికారి

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. నవంబర్ 14నుంచి 19 వరకు వ్యాసరచన, సెమినార్, ఉపన్యాస, ముగ్గులు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన 30మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సత్యనారాయమూర్తి, వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, వివిధ సంస్థల సభ్యులు అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సాగర్, లైబ్రేరియన్లు మురళీ, రమేశ్, కృతీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాక్సింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 21న స్థానిక మోడల్‌స్కూల్‌లో అండర్ -14, 17, 19న జోనల్ స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఫణిరాజాను సంప్రదించాలని తెలిపారు.

23న జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్

పాతమంచిర్యాల: జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈ నెల 23న గుడిపేటలోని మౌంట్ కార్మెల్‌స్కూల్‌లో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ అల్ఫి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి, కార్యదర్శి మారయ్య తెలిపారు. విజేతలు డిసెంబర్ ఒకటిన మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపపిల్లల విడుదల



చేప పిల్లలు వదులుతున్న అధికారులు

భీమారం: మండలంలోని గొల్లవాగు ప్రాజెక్ట్‌లో బుధవారం లక్ష పదిహేను వేల చేప పిల్లలను మత్స్యశాఖ అధికారి రాందాస్, ఎంపీవో సతీష్ రెడ్డి కలిసి విడుదల చేశారు. రాందాస్ మాట్లాడుతూ.. గొల్లవాగు ప్రాజెక్ట్‌లో విడుతల వారీగా చేపపిల్లలను విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ముదిరాజ్ సంఘం నాయకులు దబ్బటి శంకర్, అందవేని సారయ్య, మహేష్, సుంకరి శేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.

సహకార సంఘాలు బలోపేతం చేసుకోవాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



చెన్నూర్‌రూరల్: సుద్దాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

చెన్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సహకార సంఘాలను బలోపేతం చేసుకోవాలని చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం మోర్ల లక్ష్మణ్ అధ్యక్షతన మండలంలోని సుద్దాల గ్రామంలో శ్రీ బాలాజీ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార సంఘాలు పరస్పరం సహకరించుకొని సమన్వయంగా ప్రగతి పథంలో ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అధికారి సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, శ్రీ బాలాజీ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం కార్యదర్శి నికుడ లక్ష్మణ్, సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

లక్సెట్టిపేట: 71వ అఖిలభారత సహకార వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని చందారం గ్రామంలో జెండా ఆవిష్కరించారు. పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు సత్యనారాయణ, ఎల్లారెడ్డి, చంద్రయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

300వ రోజుకు నిత్య జనగణమన గీతాలాపన



జాతీయ జెండాతో ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన నిత్య జనగణమన జాతీయ గీతాలాపన కార్యక్రమం బుధవారంతో 300రోజులకు చేరింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండ్ పుర వీధుల మీదుగా కాంటా చౌరస్తా వరకు 100మీటర్ల జాతీయ పతాకంతో విద్యార్థులు భారీ ప్రదర్శన చేశారు. జాతీయ పతాకాన్ని చేతబూని పుర ప్రజల్లో జాతీయ భావాన్ని రేకెత్తించారు. కాంటా చౌరస్తా వద్ద విద్యార్థులు సామూహికంగా జాతీయ గీతానికి వందనం చేశారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ... ప్రజల్లో దేశభక్తిని, సమైక్యత భావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో నిత్య జనగణమన కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జాతీయ గీతాలాపన కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనహిత సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పుర ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లకు అటవీ అనుమతులు ఇప్పించాలి



దోబ్రియాల్‌తో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు అటవీశాఖ అనుమతి ఇప్పించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రాష్ట్ర ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్)ఆర్ఎం.డోబ్రియాల్‌ను కోరారు. హైదరాబాద్‌లో పీసీసీఎఫ్‌ను బుధవారం ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి అటవీ శాఖకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పోడు భూముల సమస్యలు ఇంకా సమిసి పోలేదని, ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి కావాల్సిన అటవీ శాఖ అనుమతులను ఇప్పించి సహకరించాలని వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని పీసీసీఎఫ్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

డీఎస్ చౌహాన్‌ను కలిసిన సీపీ



మంచిర్యాలక్రైం: జిల్లాలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించేందుకు వచ్చిన తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్, అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్‌ను బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు, స్థానిక డీసీపీ ఎగ్గడి భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా నిర్వహించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

బెల్లంపల్లి: ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న సర్వేను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్వే సిబ్బందితో మాట్లాడుతూ... సర్వేను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఎంపిక చేసే ప్రతి ఇంటినీ తప్పక సర్వే చేయాలని, సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు బోధిస్తున్న పాఠాలను విన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి శ్రద్ధతో విద్యాబోధన చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు , సిబ్బంది ఉన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న వెరబెల్లి రఘునాథ్

పాతమంచిర్యాల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రేవంత్‌రెడ్డి సమైక్య ఆంధ్రాకు మద్దతు ఇస్తే.. కిషన్‌రెడ్డి తెలంగాణ కోసం పోరుబాట పట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, దుర్గం అశోక్, పత్తి వెంకటకృష్ణ, ఆకుల అశోకవర్ధన్, జోగుల శ్రీదేవి, అక్కల రమేష్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బేర రామన్న, శైలేంద్రసింగ్ పాల్గొన్నారు.

మాలల హక్కులు పరిరక్షించాలి

- ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్

శ్రీరాంపూర్: మాలల హక్కులు ప్రభుత్వం పరిరక్షించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్‌లో బుధవారం మాల మహానాడు నేతలతో కలిసి డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30లక్షల మంది మాలల జనాభా ఉందన్నారు. కులాల ప్రకారం రెండో స్థానంలో ఉన్న మాలలకు రాజకీయంగా మరింత గుర్తింపు రావాల్సి ఉందన్నారు. మాలలు తమకు కల్పించిన హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఆత్మగౌరవం, హక్కుల కోసం జరిగే పోరాటానికి ప్రతి మాల సోదరుడు కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తొగరు సుధాకర్, సుదమల్ల హరికృష్ణ, పొట్ట మధూకర్, జూపాక సుధీర్, పుల్లయ్య, కూన రవి, ఎర్రం తిరుపతి, కాటం రాజేశం, చిప్పరి రాజమల్లయ్య, జీ మనోజ్‌కుమార్, కాసర్ల యాదగిరి పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: కోలిండియాలో పలు పతకాలు, సింగరేణి స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచిన పలువురు క్రీడాకారులను బుధవారం ఏరియా వర్క్‌షాపులో సింగరేణి అధికారులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ)నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్క్‌షాపు అధికారులు, ఏఐటీయూసీ నాయకులు, తోటి ఉద్యోగులు ఉన్నారు.

బీసీ సంఘం కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, సీహెచ్‌పీలలో బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘాన్ని బుధవారం ఎన్నుకున్నారు. బీసీ సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య హాజరయ్యారు. వర్క్‌షాప్ కన్వీనర్‌గా పాడిశెట్టి వినోద్, కో కన్వీనర్‌గా తన్నీరు శ్రీకాంత్, సీహెచ్‌పీ కన్వీనర్‌గా అందె రాజ్‌కుమార్, కో కన్వీనర్‌గా కాసర్ల లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు.

ఓసీపీలో విజేతలకు బహుమతులు ప్రదానం

శ్రీరాంపూర్: సింగరేణి బొగ్గు నాణ్యతపై మంగళవారం ఓసీపీలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. గనిపై జరిగిన కార్యక్రమంలో గని ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ బహుమతి ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తేనే కంపెనీ మనుగడ సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో గని క్వాలిటీ ఇన్‌చార్జి కమ్రుద్దీన్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ మోతె లచ్చన్న, జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, సంక్షేమ అధికారి శంకర్, జలాలుద్దీన్ పాల్గొన్నారు.

తిరుమలపూర్‌లో కుంరం సూరు వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామపంచాయతీ కొత్త తిరుమలపూర్‌లో కుంరం సూరు వర్ధంతిని కోలాం సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డోలు, వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి జెండావిష్కరించి పూలమాలలతో నివాళులర్పించారు. సూరు నిజాం పాలకులకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన ఉద్యమాన్ని నడిపించిన కుంరం భీం ప్రధాన అనుచరుడిగా గెరిల్లా సైన్యం ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. అతడి ఆశయ సాధనకు ప్రతి ఆదివాసీ ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి వెంకటేష్, ఆత్రం మహేష్, టేకం శ్రీనివాస్, సిడాం గణపతి, పెంద్రం శంకర్, సిడాం అంబారావు తదితరులున్నారు.

సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణను కోరారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రం బుధవారం అందించారు. ఏరియాలో సెక్యూరిటీ సిబ్బంది తక్కువగా ఉన్నారని, వెంటనే పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ సుంకరి రమేశ్, సిబ్బంది ఉన్నారు.

'ప్రైవేట్ సెక్యూరిటీని విధుల్లోకి తీసుకోవాలి'

మందమర్రిరూరల్: గత నెల 27నుంచి సింగరేణి మందమర్రి ఏరియాలో 47మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు యాజమాన్యం కాంట్రాక్టర్ లేని కారణంగా విధులకు తీసుకోవడం లేదని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జరిగిన నిర్లక్ష్యానికి విచారణ చేపట్టాలన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: కార్మికుల సమస్యలు పరిష్కరించి కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేటు మీటింగ్ నిర్వహించి, మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, గని పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మినారాయణ, నాయకులు రాజేందర్, పార్వతి సురేష్, రంజిత్ కుమార్, అశోక్, చౌడ లింగయ్య తదితరులున్నారు.

బ్యాంకుల్లో భద్రత ఏర్పాట్ల పరిశీలన

చెన్నూర్: చెన్నూర్‌తో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లలో భద్రత ఏర్పాట్లను సీఐ రవీందర్ పరిశీలించారు. భద్రతా లోపం కారణంగా వరంగల్ పరిధి లోని రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంక్‌లో చోరీ జ రిగిందన్నారు. ఇతర జిల్లాలో జరిగిన సంఘటనలు చెన్నూర్ ప్రాంతంలో చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్లకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలి

తాండూర్: సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ బ్యాంక్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని బ్యాంక్‌లను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సీసీ కెమెరాల పనితీరు, బ్యాంక్ లాకర్లను పరిశీలించారు. బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అలారం, ఏటీఎం మిషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రత చర్యలను పర్యవేక్షించారు. బ్యాంక్‌ల వద్ద తగిన భద్రత చర్యలు చేపట్టి వినియోగదారులకు కష్టం కలగకుండా చూడాలన్నారు. పోలీసులకు ప్రజలు శాంతి భద్రతల విషయంలో సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

కేకే-ఓసీని సందర్శించిన డైరెక్టర్




ఓసీలో పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి సందర్శించారు. పని ప్రదేశాలను పరిశీలించి ఈ ఆర్థిక సంవత్సరం ఓసీకి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజు ఉన్నారు.

సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలోని సులభ్ కాంప్లెక్స్‌ల్లో పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం యాజమాన్యాన్ని కోరారు. బుధవారం ఆయన కొత్తగూడెంలో కంపెనీ డైరెక్టర్(పా, పీపీ) జీ వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 20ఏళ్లుగా పనిచేస్తున్న సులభ్ కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. దుర్భరమైన జీవితం గడుపుతున్నారన్నారు. వారికి బోనస్, సీఎంపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మిలకు ప్రమాద బీమా పొందడానికి హెచ్‌డీఎఫ్‌సీ వేతన ఖాతాలను తెరువడంలో కొందరు కాంట్రాక్టర్లు జాప్యం చేయిస్తున్నారన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మోడల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న డీఈవో యాదయ్య

భీమిని: విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని డీఈవో యాదయ్య అన్నారు. కన్నెపెల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో 'రూమ్ టూ రీడ్ ఇండియా' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రాము, కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్, ఎల్ఎఫ్ సుచరిత, సీఆర్పీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జేక శేఖర్ ఉట్నూర్ కేంద్రంగా జరిగిన ఎన్నికల్లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కనక రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో బుధవారం జరుగుతున్న కాంగ్రెస్ సేవాదళ్ ఉత్సవాలకు జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సేవా దళ్ జాతీయ అధ్యక్షులు లాల్‌జి దేశాయి, నీలకంఠేశ్వర్‌రావును శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఆయన వెంట జిల్లాకు చెందిన సేవాదళ్ నాయకులు ఉన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక పారిశ్రామికవేత్త పూస్కూరి వరప్రసాదరావు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందజేశారు. పాఠశాలకు అవసరమైన వస్తువులు, సౌకర్యాలు సమకూర్చడానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వరప్రసాదరావును పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాత

జన్నారం: మండలంలోని కిష్టాపూర్, కవ్వాల్, చింతగూడ గ్రామాల్లో కలెక్టర్, డీఆర్‌డీఏల ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం కళాజాత నిర్వహించారు. కళాకారులు పాటల ద్వారా ప్రభుత్వ పథకాలు, పాలనపై అవగాహన కల్పించారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమైన కళాజాత కార్యక్రమాలు డిసెంబర్ 7వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో కళాకారులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నెన్నెల: మండలంలోని మైలారంలో డీసీఎంఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, హరీష్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము రాజన్న, నాయకులు మల్లాగౌడ్, వెంకటేష్, రాజాగౌడ్, తిరుపతి, సతీష్ పాల్గొన్నారు.